# మగువ మనసు

రచన:
శ్రీ. కలగర్ల నరసింహామూర్తి.

అదేపనిగా మ్రోగుతున్న టెలిఫోన్ శబ్దం, నా ప్రశాంతమైన నిద్రకు భంగం కలిగించింది. బద్ధకంగా బెడ్ మీదనుండి లేచి వాచీవంక చూసాను. ఉదయం నాలుగన్నర అయింది. విసుగుతో రిసీవరు అందుకొని జవాబిచ్చాను. ఎవరో పసిపిల్లకు చాలా ప్రమాదంగా ఉందని ఆ ఫోనులోని సంభాషణ సారాంశం. ఫోనులో మాట్లాడిన ఆ వ్యక్తి గొంతులో దీనత్వం స్పష్టంగా కనిపిస్తూ, రాతి హృదయాలలు కూడా కరిగించేలా ఉంది. నేను తొందరగా వెళ్ళి డ్రస్సు చేసుకొని, మెడిసన్ బేగ్ తో బయలుదేరాను.

'సువాసిని భవనం నుండి మాట్లాడుతున్నా' అని ఫోనులో వినిపిస్తే, సువాసిని అంటే ఎవరో స్త్రీ పేరు అనుకున్నాను గానీ, కానీ సువాసినీ అంటే ఒక భవనం పేరని ఆ భవనాన్ని చూడగానే తెలిసింది. పాపం, ఆ ఇంట్లోని రెండేళ్ళ అమ్మాయికి మూర్ఛరోగం ఉంది. నేను వెళ్ళి చూసేటప్పటికి ఆ అమ్మాయి తెలివితేటలు తప్పిపోయి, చాలా భయంకరంగా కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ ఉంది. పిల్లమాత్రం ముద్దొచ్చేలా చూడ ముచ్చటగా ఉంది.

నేను తొందరగా ఆ అమ్మాయి నాడి పరీక్షించి టెంపరేచరు నోట్ చేసాను. పాపం! నాడి చాలా విపరీతమైన వేగంతో కొట్టుకుంటోంది. నేను మెల్లగా తల ఎత్తి, ఆ అమ్మాయి తలిదండ్రుల వంక చూసాను. లోకంలోని విచారమంతా ఆ దంపతుల వదనంలో నాకు కనిపించింది. ఆ అమ్మాయికి ఇస్తున్న ఆహారం గురించి, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి, వాళ్ళను ప్రశ్నించి తెలుసుకున్నాను. తర్వాత మందు తయారు చేసి ఇచ్చి, ఎలా వాడాలో చెప్పాను.

'మరేం భయపడకండి! ఒకటి రెండు రోజుల్లో నయమవుతుంది. అజీర్ణంవల్ల వచ్చిన ఒకవిధమైన జ్వరమిది' అన్నాను ఆ దంపతులకు కాస్త ధైర్యం చెబుతూ.

'థ్యాంక్యూ డాక్టర్! పిలవగానే, మాయందు దయవుంచి పరిగెత్తుకొని వచ్చారు. మీకు నిద్రాభంగం కలిగించినందుకు మమ్మల్ని క్షమించండి!' అంటూ ఇంటి యజమాని, ఒక పదిరూపాయల నోటును నాకు అందించాడు.

యాంత్రికంగా నేను ఆ నోటును జేబులో వేసుకొని 'అబ్బే! దానికేం లెండి! ఇది నా డ్యూటీ!' అన్నాను. అంటూ ఆ దంపతుల్ని తొలిసారిగా, బాగా పరికించి చూసాను. అంతే! నేను కలగంటున్నానా, తెలివిగానే ఉన్నానా అనిపించి, తిరిగి ఆశ్చర్యంతో ఆ స్త్రీవంక చూసాను. అవును, సందేహం లేదు. శకుంతలే!

శకుంతల కూడా నా వంక ఆశ్చర్యంగా చూసి, చిన్న చిరునవ్వు నవ్వింది. కానీ ఏమీ మాట్లాడలేదు. నా తల గిఱ్ఱున తిరిగిపోయింది. అవును, అదే చిరునవ్వు. శకూ! నన్నెందుకిలా బ్రతకనివ్వవు? నువ్వెందుకలా నవ్వుతావ్? నన్నెందుకిలా ఒంటరిగా, శాంతిగా బ్రతకనివ్వవు? ఓహో! నిన్ను మరచిపోవాలని ఎంతో ప్రయత్నిస్తున్నాను. అవును మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తున్నాను. నేను మదరాసు వదిలేసి, ఇక్కడ స్థిరపడటానికి అదే కారణం. నా ఖర్మ. కాకపోతే నువ్వూ ఇక్కడే ఉండాలీ? తిరిగి నన్నెందుకిలా దుఃఖపెడుతున్నావ్ శకూ!

నేను ఇక్కడకు వచ్చి సుమారు మూడేళ్ళయింది. ఇక్కడ నాకు విశ్రాంతి అసలు లేనేలేదని చెప్పాలి. పని, పని, చచ్చేవరకూ పని, అంతంలేని పని. ఇదంతా నా కొక గొప్ప విజయమని నీకు అనిపించవచ్చు. అయినా నా మనసు అప్పుడప్పుడు నిన్నే కలవరిస్తోంది శకూ! నా ఆలోచనలలో నీ రూపం నాకు ఇంకా గోచరిస్తోంది. ఐనా ఇంతవరకూ నీ ప్రత్యక్షరూపానికి దూరంగా ఉండి తప్పించుకోగలిగాను. కానీ ఇప్పుడు నువ్వు వివాహితవు అంతా ముగిసిపోయింది శకూ! అవునా శకూ!

* * *

నేను అప్పుడప్పుడు బాగా అలసిపోయి, విశ్రాంతి కోరేవేళల్లో, నా ఆల్బాన్ని తెరచి, ఒక ఫోటోలోని సుందరివంక ప్రత్యేకించి అలా చూస్తూ తన్మయం పొందుతాను. నువ్వే ఆ సుందరివి శకూ! అందులో నువ్వెంత మధురంగా, మనోహరంగా నవ్వుతున్నావ్!

నీ అందాన్ని శాశ్వతంగా నా హృదయంలో ముద్రించుకోడానికి ఆ ఒక్క చిరునవ్వు నాకు చాలు. శకుంతలా! ఆ స్నాప్!...నీకు గుర్తుందా! అయినా శాథనూర్ డాంను నువ్వెలా మరచిపోగలవు! ఆనాటిరోజులు... ఆ తీయని గాథ...

ఎవరో అన్నారు, శాథనూర్ డాం, పిక్నిక్‌కు చాలా అనువైన స్థలమని. వెంటనే ఆ తీర్మానాన్ని మిత్రవారంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. నా హేండ్ కెమెరాను ఫిలింతో దట్టంగా నింపాను. నేనొక చిన్న ఫొటోగ్రాఫర్‌నుకూడ లెండి.

శాథనూర్ డాం, అందానికి ఆనందానికి మారు పేరు. ఆ పరిసరాల్లోని ప్రకృతి సౌందర్యాన్ని మనతో పాటు తెచ్చుకోవాలంటే, తప్పకుండా కెమెరా తీసుకు వెళ్ళాల్సిందే!

దట్టమైన పచ్చగడ్డిమీద నిలబడి, తనుచుట్టూ ఉన్న జనసమూహాన్ని చూడకుండా ఎటో చూస్తున్న ఒక చక్కని జింకను మా మిత్రులకు చూపించాను. మెల్లగా, మెరుస్తున్న కళ్ళతో ప్రశాంతంగా తిరిగి మావంక చూసిందా జింక. వెంటనే నేను కెమేరాను తెరచి, దూరాన్ని నిర్ణయించుకొని, అపరేచర్ సర్దుకొని, సరిగ్గా టైం చూసుకొని షట్టర్‌ను వదిలాను. అంతే! ఎంతో చక్కని ఫోటోను తీయగలిగాను.

'ఎంత ముచ్చటగా ఉంది ఫోటో!' అనుకున్నాను నేను. 'అబ్బే! ఏదో లేడి బొమ్మను నిలబెట్టి ఫోటో తీసారు. జీవంగల లేడి, అందులోనూ ప్రశాంతమైన పచ్చిక బయలుపై బుద్ధిగా నిలబడి, మీమాట విని ఫోటో తీయించుకుంటుందా!' అన్నావు నువ్వు. గుర్తుందా శకూ! నువ్వేకాదు చాలామంది మిత్రులు, నీలాగే అపోహపడ్డారులే!

కొంచం దూరంలో, ఒక పనివాడు చేతిలో ఒక సుత్తి పట్టుకొని నిలబడి, ఒక పెద్దరాతిని విరక్కొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. అతని నుదుటను మెరుస్తున్న చెమట బిందువులు, ఆ రాతిని విరక్కొట్టాలని, అతని వదనంలో మెరుస్తున్న దీక్ష...చూస్తుంటే ఇతడే శ్రమ జీవి అనిపించి, నా కెమేరాను తిరిగి క్లిక్‌మనిపించాను. ఆ ఫోటో, పత్రికలో పడగానే నాకో బహుమతికూడా వచ్చింది. నీకు తెలుసుగా!

కొద్ది క్షణాల్లో నా కెమేరాకు తిరిగి పని తగిలింది. ఎదురుగా కొద్ది దూరంలో ఒక చక్కని పాలరాతి విగ్రహం కనిపించింది. ఆ విగ్రహంలోని స్త్రీ మూర్తి, ఒక అందాల రాశిలా, సౌందర్య రాణిలా నా దృష్టికి గోచరించింది. ఒంటరిగా, ఒక గోడకు ఆనుకొని, గడ్డానికి, చెక్కిలికి మధ్య తన అరచేయి ఆన్చి, ఆకాశంవంక అందాలబాల చూస్తున్నట్లుంది. నిజంగా ఆ శిల్పంలో జీవకళ ఉట్టిపడుతోంది. అంత చక్కని శిల్పాన్ని చెక్కిందెవరోగానీ, అతన్ని అభినందించలేకుండా ఉండలేకపోయాను.

నేనా చక్కని బొమ్మకు దగ్గరగా ఎదురుగా, దరిదాపు నా కెమేరా, ఆ శిల్పంలోని సుందరి ముఖాన్ని క్లోజప్‌లో తీసుకొనేటందుకు సరిపోయేటంత దగ్గరగా వెళ్ళి, కెమేరా సర్దుకున్నాను. అంతే! కెమేరా క్లిక్ మనడమేమిటి, ఆ శిల్పం కదలడం ఏవిటి, రెండూ ఒకే సారి జరిగాయి. నేను తృళ్ళిపడి, కళ్ళు నులుముకొని చూసాను. నేను చూసింది శిల్పంకాదు. జీవంగల చక్కని అమ్మాయి. ఆ అమ్మాయి కోపంతో ముఖాన్ని జేవురించుకొని, విసవిసలాడుతూ నా దగ్గరకువచ్చి, కోపంతో ఏదో అనబోయింది.

ఆవిడ ఏదో అనేలోపుగానే నే నామెను క్షమించమని కోరుతూ 'మన్నించండీ! మీరలా నిలబడి ఏదో శూన్యంలోకి చూస్తుంటే, మీ రేదో చక్కని పాలరాతి శిల్పమనే అనుకున్నాను గానీ, మనిషిఅని అనుకోలేదు. నా ఈ యొక్క అమర్యాదాకరమైన చర్యకు నన్ను క్షమించండి మేడం!' అన్నాను.

నా మాటల్లోని నిజాయితీనీ, నిర్మలత్వాన్నీ గ్రహించిందో, ఏమో, ఆ అమ్మాయి నా మాటలతో పూర్తిగా చల్లబడిపోయింది. ఆమె ముఖంలోని క్రోధం మాయమయింది. పగడంలాంటి ఆమె పెదవులపై, చక్కని చిరునవ్వు తళుక్కున మెరిసింది.

'అబ్బే! దానికేం లెండి! కానీ తమరు డెవలపింగ్ ముగిసిన తర్వాత, నా ఫోటో నెగటివ్‌ను తిరిగి నాకు ఇచ్చేయగలరా! ఆ ఖర్చులు నేను భరించుకుంటాను లెండి! దయచేసి ఆ నెగటివ్‌ను మిస్ శకుంతల, బి. ఏ., క్వీన్ మేరీ కాలేజ్‌కు, పంపండి' అందామె.

'ఎంతమాటండీ! మీ కెంతమాత్రం ఖర్చులు భరి

నక్కర్లేదు. మీ నెగెటివ్‌ను తప్పకుండా మీకు పంపించేస్తాను. నా పేరు రాజా. మద్రాసు మెడికల్ కాలేజీలో ఫైనలియర్ మెడికోను నేను' అన్నాను నేను.

ఇంతలో కొంతమంది అమ్మాయిలు గుంపుగా రావడం వల్ల అంతటితో మా సంభాషణ ఆగిపోయింది. ఆమె నావద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతూ ఉంటే, ఆమెవంకే చూస్తూ, విగ్రహంలా నిలబడిపోయాను నేను.

ఒకనాడు నేను డ్రాయింగ్ రూంలో కూర్చొని, ఏదో పుస్తకాన్ని చాలా దీర్ఘంగా చదువుతున్నాను.

'నిమ్మీ! నిమ్మీ!' అని బయటనుండి ఎవరో పిలుస్తున్నారు.

పుస్తకాన్ని చదువుతున్న నాకు ఎవరుపిలుస్తున్నారో అని లేచి చూడ్డానికి కూడా బద్ధకమనిపించింది. అయినా బైటనుండి ఎవరో 'నిమ్మీ! నిమ్మీ! అని మరింత బిగ్గరగా పిలుస్తున్నారు. ఏమిటీ గావుకేక అనిపించిందినాకు.

వెంటనే కోపంతో లేచి, ఎవరు పిలుస్తున్నారో చూద్దామని బైటకు వెళ్ళాను. అంతే! ఆ వ్యక్తిని చూడగానే నా కోపం ఇట్టే మాయమైపోయింది. నావదనం, ఆనందంతో మెరిసిపోయింది. ఒక్క క్షణంవరకూ, నేను మానసికంగా మూగవాణ్నయిపోయాను. వచ్చిన అతిథితో, ఎంత నెమ్మదిగా మాట్లాడాలో, ఎంత బాగా మర్యాద చెయ్యాలో, ఆలోచిస్తూ ఉండిపోయాను.

'నిమ్మీ! ఇప్పుడే అలా బైటకు వెళ్ళింది. ఆక్షణంలోనైనా తిరిగి రావచ్చు. దయచేసి ఈ దీనుని కోరిక మన్నించి కాస్సేపు ఇలా లోనికివచ్చి కూర్చోండి శకుంతలా!' అన్నాను నేను, అంతకంటే ఏమనాలోతోచక.

శకుంతల ఎంతో ఆశ్చర్యంతో నా ముఖంలోనికి సూటిగా చూసింది. ఆశ్చర్యంతో వణకుతున్న పెదవులపై చిరునవ్వు మెరుస్తుండగా 'అరే! మీరా! ఇక్కడున్నారా!' అంది.

'అవును! అన్నట్టు మీకు మీ నెగెటివ్ అందిందా! దాన్ని మీకు ఆ మర్నాడే పోస్టులో పంపించేసాను. అన్నట్టు మీ ఫోటో ఎంత బ్యూటిఫుల్‌గా వచ్చిందనుకున్నారు? మిస్ శకుంతలా! అనకూడదు గానీ, ఆ ఫోటోను చూస్తే ఎంతటి మడిగట్టుకున్న మగవాడైనా సరే, ఇట్టే మానినీ లోలుడవుతాడు సుమండి! అసలే మీరు అందమైనవారు. అందుకు పైగా మాంచి ఫోటోజెనిక్ ఫేస్ మీది!' అన్నాను ఆమెను అభినందిస్తూ.

కానీ నా అభినందనలు విని ఆమె కాస్తా సిగ్గుపడినట్టు కనిపించింది. 'అరేరే! నేనేదో విపరీతంగా వాగేసానే!' అనుకున్నాను నేను.

'చాలా థ్యాంక్సండీ! మీ కెమేరా చాలా గొప్పదిలా కనిపిస్తోంది!' అంటూ ఆమె తిరిగి తీయగా నవ్వింది. అలా నవ్వుతుంటే ఆమె చక్కని బుగ్గల్లో గులాబీలు వికసించాయి. తేనె లొలుకుతున్న ఎఱ్ఱని పెదిమలు మిలమిలమని మెరిసిపోతున్నాయ్.

'శకుంతలగారూ! ఒక్కమాట నిజం. అందం కనిపించాలే గాని, ఆ అందాన్ని పూర్తిగా సంగ్రహించడంలో, నా కెమేరా ఎన్నడూ గురితప్పదు సుమండీ!' అన్నాను నేను పకాలున నవ్వి.

ఇటువంటి పొగడ్తలు వింటే ఏ అమ్మాయి మాత్రం ఆనందంతో పొంగిపోదు చెప్పండి? ఎల్లప్పుడూ వయసులోని యువతులు వాంఛించేది 'మీరు చాలా అందమైన వారండీ!' 'మీ అందం అద్భుతం సుమండీ' ఇలాంటి యువకుని పొగడ్తలు.

శకుంతల ఏదో జవాబు ఇస్తుంటే, ఒక అడ్డంకి మా నిమ్మీ రూపంలో వచ్చి, మా సంభాషణకు అంతరాయం కలిగించింది. నాకు చాలా కోపం వచ్చింది. 'ఎవరు ఈ నిమ్మీని ఇంత వేగంగా తిరిగి రమ్మన్నారు' అనుకున్నాను నేను.

'ఓ! హలో శకూ!' అంటూ పెద్దగా అరిచింది నిమ్మీ.

'ఏమిటీ బోర్!' అనుకున్నాను నేను. శకుంతల,నిమ్మీకి సమాధానం ఇచ్చేలోగా నేనులేచి 'మీ సంభాషణకు అంతరాయం కలిగించడం నా కిష్టంలేదు' అన్నాను.

ఆ తర్వాత అదేవిధంగా మా ఇంట్లోనే, శకుంతలను మూడోసారి, నాలుగోసారి నేను కలుసుకున్నాను.

* * *

'ఒరేయ్ రాజా! ఈ సంగతి కనిపెట్టావా! ఈ మధ్య మా శకుంతల చాలా తరుచుగా నన్ను చూడ్డానికి వస్తోంది' అంది నిమ్మీ ఒకనాడు పకపకమని నవ్వుతూ.

'ఇందులో అంతగా కనిపెట్టవలసింది. నవ్వవలసిందీ ఏముందీ?' అన్నాను నేను అమాయకంగా.

నిమ్మీ నా కండ్లలోనికి చిలిపిగా చూస్తూ 'అయ్యో! అలా నా రాజాగారూ! పాపం ఆ చిట్టిశకుంతల సాధారణంగా, మా అన్నయ్య, ఇంట్లో ఉన్నప్పుడే వస్తూఉంది

అంతేగాదు. ఇంకో వింత! మా రాజా అన్నయ్యకూడా, అవిడగారు ఇంటికిరాగానే, కదలకుండా, బైటకు వెళ్ళకుండా, బుద్ధిమంతునిలా ఇంట్లోనే కూర్చుంటున్నాడు' అంది.

నేను నిమ్మీవంక చూసి చిరునవ్వు నవ్వాను. చిన్నప్పటినుండీ నిమ్మీ చాలా పెంకిపిల్ల. ఐనా తెలివైనది. అందువల్ల నిమ్మీదగ్గర నా ప్రణయరహస్యందాచి లాభం లేదని నాకు తెలుసు. ఎలాగైతేనేం నా ప్రణయ రహస్యాన్ని శకుంతల తండ్రిదగ్గరకు చేరవేసింది మా చెల్లాయి నిమ్మీ.

ఆ తర్వాత ఒకనాడు శకుంతల, మామూలుగా తన మిత్రురాలిని కలుసుకోవాలనే నెపంతో, మా ఇంటికి వచ్చింది. ఆమె వచ్చేటప్పటికి నిమ్మీ ఇంట్లో లేదు. ఇంట్లో ఉన్నదల్లా నేనొక్కణ్ణే:

నేను చిలిపిగా శకుంతలవంక చూస్తూ 'శకూ! నీకీ సంగతి తెలుసా!' అన్నాను.

శకుంతల తాపీగా సోఫాలో కూర్చొని 'అబ్బే! నాకేం తెలియదే? ఏవిటి సంగతి?' అంది.

ఆ ఏకాంత సమయంలో నా కెంతో మొండిధైర్యం కలిగింది. ఏన్నో రోజులనుండి ఆమెతో నాకుగల పరిచయాన్ని చనువుగా మార్చుకొని, 'మెల్లగా వెళ్ళి సోఫాలో, ఆమె సరసనే, ఆమెను తాకుతూ కూర్చున్నాను. మెల్లగా ఆమె చెవిలో 'నువ్వు నాదానవు కాబోతున్నావు తెలుసా శకూ! మీ నాన్నగారు కూడా అంగీకరించారు. ప్రస్తుతం మన జాతకాలను పరిశీలిస్తున్నారు. కనక మన వివాహ మహోత్సవం' అంటూ మెల్లగా వంగి నా పెదిమల్ని, ఆమె చెంపలతో చేర్చాను. నా రెండుచేతుల్నీ ఆమె బుజాలమీద వేసి, ఆమెను దగ్గరకు లాక్కొని, నా హృదయానికి హత్తుకున్నాను.

శకుంతల సిగ్గుతో, నానుండి కొంచం దూరంగా జరిగిపోయి కూర్చొని 'అబ్బా! అబ్బాయిగారి కెంత తొందర? దయచేసి కొద్దిరోజులు ఓపికపట్టాలి మరి!' అంటూ కిలకిలనవ్వి నా చెంపమీద చిటిక వేసి తుఱ్ఱున పారిపోయింది.

కానీ అకస్మాత్తుగా ఒక అనుకోని సంఘటన మా ప్రేమలతను బగ్గున మంటబెట్టి మాడ్చి మసిచేసింది. మా జాతకాలు ఒకదానితో ఒకటి అతకని కారణంగా, మా వివాహం జరగడానికి వీల్లేదని తెలిసింది. పిడుగులాంటి ఆ వార్తను విని, భరించలేక కుప్పలా కూలిపోయాను. రెండు హృదయాల కలయిక, రెండు జాతకాల కలయిక కంటే ముఖ్యమని మా తలిదండ్రులు అంగీకరించరు. తరతరాలుగా వస్తున్న మూఢాచారాలను, తమ రక్తంలో జీర్ణించుకున్న మా తలిదండ్రులను, ఎదుర్కొని వాదించగల ధైర్యసాహసాలు నాకు లేవు.



*

విఠల్ ప్రొడక్షన్స్‌వారి "మదనకామరాజు కథ"లో ఒక దృశ్యం.

*

మొగ్గవంటి నా ప్రేమ, ఇప్పుడిప్పుడే వికసించి గులాబీరేకల్ని తొడిగింది. కాని వాటిని అఘ్రాణించి, ఆనందించేలోపుగానే, ఆ రేకలు నేలరాలి నాశనమై పోయాయి. ఏం చెయ్యాలో తోచక, నా హృదయం లోనే నిశ్శబ్దంగా దుఃఖించాను. తుదకు ఈ విషాద గాథను మరచిపోడానికి ఈ తిలక్‌నగరానికి చేరుకొని, మూడేళ్ల ఈ డాక్టర్ ప్రాక్టీసు పెట్టాను.

కానీ ఇక్కడ కూడా, ధుర్విధి నన్ను ఈనాడు తిరిగి గేలిచేసింది. శకుంతల, తన వైవాహిక జీవితాన్ని ఇక్కడే సాగించాలి?

'భాను' అంటే శకుంతల కుమార్తె, రెండేళ్లది చక్కని చుక్క. నేను శ్రద్ధతో పరీక్షిస్తూ, తగినమందు లిస్తూఉంటే, ఆ పిల్ల తొందరగా తన ఆరోగ్యాన్ని కోలుకుంటోంది. ఆ అమ్మాయి ఎప్పుడు చూసినా చక్కగా నవ్వుతూ కనిపించేది. సరిగ్గా శకుంతలకు మల్లే నవ్వేది. నన్ను చూడగానే, రెండు చేతులు చాచి 'దా' అని ఆహ్వానించేది.

కాని ఆ తర్వాత, నేను తరుచూ ఆ ఇంటికి ఎందుకు వెళుతున్నానో, నాకే తెలిసిందికాదు. ఒకవేళ 'భాను' చికిత్స పేరుతో, నా హృదయంలో మరచిపోలేని నా శకుంతలను చూడ్డానికి కాదుకదా! ఏమో! ఎందుక్కా కూడదూ?

కానీ శకుంతల, నన్ను అనగా తన రాజాను పూర్వంగా ఖాతరు చేస్తున్నట్లు కనిపించడం లేదు. ఆమె పూర్తిగా గతాన్ని మరచిపోయి, వర్తమానంలో పూర్తిగా కలిసి పోయినట్లనిపించింది. ఆమె చాలా సుఖంగా, సంతోషంగా ఉన్నట్లు కనిపించింది. ఆమె ముఖం చూస్తే అలా అనిపిస్తోంది.

ఒకనాడు నేను భానును పరీక్షిస్తుండగా, ప్రక్క గదిలోనుండి మెల్లగా ఏవేవో గుసగుసలు వినిపించాయి.

'శకుంతలా! ఈ డాక్టరెవరో నీకు తెలుసా ఏం? అతని వాలకం చూస్తే' ఇది శకుంతల భర్త గొంతు:

'అవునండీ, అతను నా స్నేహితురాలి అన్నయ్య. కాస్త మన స్థిమితం లేనట్టివాడు. కొన్నాళ్ల క్రితం నేనంటే ప్రాణం కోసుకొనేవాడు. అయినా ప్రమాదస్థుడు కాదు లెండి' ఇది శకుంతల జవాబు.

ఆపైన వినలేకపోయాను. వినదల్చుకోలేదు కూడా. కారులో కూర్చొని, డ్రైవ్ చేస్తూ వెళుతోంటే, గతమంతా ఒక్కసారి నా కళ్లముందు మెరుపులా మెరిసింది. ఆమె నాకు దూరంకాగానే జీవితంలో ఏదో అమూల్యమైన వస్తువును పోగొట్టుకున్నట్లు బాధపడి, ఇంకో కన్యను వివాహం చేసుకోలేక, ఒంటరిగా జీవితాన్ని గడుపుతున్నాను. కానీ ఆ చక్కని చుక్క మాత్రం, నానుండి దూరమైన తర్వాత, నన్ను మరచిపోవడమే గాక, కులాసాగా వైవాహిక జీవితాన్ని గడుపుతూ,



*

రాజలక్ష్మి ప్రొడక్షన్స్ వారి

"రక్తసంబంధం"లో

రేలంగి, గిరిజ,

సూర్యకాంతం.

*

నన్ను అనగా తన ప్రేమికుణ్ణి, తన భర్తముందు పిచ్చివాడని చెప్పింది. ఆమె అంత సులభంగా గీతాన్ని మరచిపోయింది ఆ పని నాకు చేతకాలేదు.

* * *

ఆడదానికి-మగవాడికి మధ్య ఎంత భేదముంది?

ప్రేమ మాధుర్యం, ఎంత మనోహరమైనదో, నాకు జీవితంలో మొదటిసారిగా రుచిచూపిన ఒక సుందరి కోసం, ఆమె జ్ఞాపకార్థం, ఇక్కడ నేను ఒంటరిగా-మరపురాని భగ్నప్రేమగాధ బాధతో, అధిక వేదనతో, స్వగ్రామానికి దూరంగాపడి జీవచ్ఛవంలా బ్రతుకు సాగిస్తున్నాను. ఆ సంఘటనలన్నీ, ఏన్నోఏళ్ళక్రితం జరిగినా, ఇంకా ఇప్పుడిప్పుడే జరిగినట్లు, ఇంకా నాకళ్ళముందే మసలుతున్నాయ్. కానీ ఆవిడమాత్రం ఒకనాటి ఆ మధుర ప్రణయగాధను, మరపురాని మధురక్షణాలను ఎలా మరచిపోగలిగింది? లేకపోతే అదంతా నటనా?

'అయ్యో! ఈ జ్ఞాపకశక్తి ఎంత భయంకరమైనది? నన్నెంతగా బాధపెడుతోంది! ఒక్క ఆడదాన్ని, నేనెందుకు మరచిపోలేకపోతున్నాను. లేకపోతే శవం తల అన్నట్లు నేను పిచ్చివెధవనా! కాదు కాదు, ఎంతమాత్రం కాదు.

ఆడదాని హృదయంలో దాగిన భావాల్ని, నాకు బొత్తిగా అర్థంకావని, ఈనాడు అర్థమయింది. 'అసలు, ఆడదానికి హృదయమంటూ ఉందా?' అని నా అనుమానం. మగవాని దృష్టిలో ప్రేమ పవిత్రమైనది. ప్రియురాలు దేవకన్య. ఆమెలేని లోకం, అతనికి శోకమయం. ఆమెతో విహరించే ప్రతీక్షణం, అతని దృష్టిలో కోటియుగాల స్వర్గ సుఖం. అతని ప్రేమ నిర్మలమైనది, నిశ్చలమైనది. ఆ ప్రేమను అతడు మరచిపోలేడు. ఆ ప్రేమ భగ్నమైతే, అతనికి బ్రతుకే భారమవుతుంది.

సరిగా అందుకు వ్యతిరేకమైన భావాలతో, ఈ భువిలో అమ్మాయిలు, శీతాకోకచిలకల్లాంటి జిగేల్ మనిపించే జాణలు, మహా షోగ్గా, అప్ టూ డేట్ గా, వక్షోజాలు, తొడలు కనిపించే డ్రస్‌తో, వందలు, వేలు, లక్షలు, కోట్లకొద్ది అమ్మాయిలున్నారు. అసలు ప్రపంచంలో జనాభా ఎక్కువయిపోయిందంటే, ఈ ఆడమరిడీల సమూహమే కారణం. కానీ శవంతల గురించి, నేనేదో గొప్పగా ఊహించుకున్నాను, గానీ ఆమెకూడా, తన సహజమైన ఆడబుద్ధికి దూరంకాలేకపోయింది. నీచత్వాన్ని, మోసాన్ని, మాయమాటల్ని పుణికిపుచ్చుకున్న ఈ ఆడవాళ్ల కరుణాకటాక్ష వీక్షణాలకోసం పరితపిస్తూ, ఎంతమంది అమాయకులైన పురుషులు నాలా, తమ జీవితాల్ని భగ్నంచేసుకొని, కుమిలి కృషించిపోతున్నారో, ఎవరికి తెలుసు! పురుషజాతిని ఇంత బలహీనంగా, స్త్రీజాతినంత కుచ్చితంగా, సృష్టించిన ఆ భగవంతునికూడా అతని భార్య పూర్తిగా లొంగదీసుకొని, కాలరాస్తూ ఉందేమో!

ఇప్పటికి నేను కన్ను తెరిచాను. నా హృదయాన్ని బాగా శోధించి, పరిశోధించి, నిజాన్ని తెలుసుకున్నాను. కారు సముద్రం ఒడ్డున ఆపి, తిన్నగా ఇసకలో నడుస్తున్నాను. ఎదురుగా ఉత్తుంగ మహోత్తరంగాలతో సముద్రం ఘోషిస్తోంది. అంతులేని ఆ సముద్రంయొక్క అంతునైనా తెలుసుకోవచ్చుగానీ, ఆడదాని హృదయ వైశాల్యమెంతోమాత్రం మనకు తెలుసుకోవడం సాధ్యం కాదు. అంబుధి అడుగున ఏముందో తెలుసుకోవచ్చునేమోగానీ, ఆడదాని, అంతర్యాన్నిమాత్రం ఏనాటికీ కనుక్కోలేం.


'నిజం, నిజం' అంది నా హృదయం.

[శ్రీ. టి. కే. బీ. గారు వ్రాసిన 'అన్ డర్ స్టాండింగ్ లవ్' అనే కథకు స్వేచ్ఛానువాదం.]


మీ వ్యవసాయాభివృద్ధికి...

SRI LAKSHMI FOUNDRY,
PATEL ROAD .... COIMBATORE.

PHONE: 3472




శ్రీలక్ష్మీ ఫౌండ్రి
పటేల్‌రోడ్... ...కోయంబత్తూరు

Manufacturing: 1 H.P. To 20 H.P. Motors
1 H.P. To 10 H.P. Monoblock Setts.
Branch: 296, Thambu Chetty St., Madras-1
(Sole Distributors for Andhra Pradesh Except the Districts of Cudappa and Chittoor) M/s. Standard Commercial Corporation, Pitchiah Street, Labbipet, Vijayawada-2.
Chittoor Agents: M/s. Sivaraj Electricals.